క్లుప్తంగా

విద్యుత్ కోతను నివారించాలి

నడిగూడెం : మండల పరిధిలోని రామాపురంలో కొద్ది రోజులుగా అప్రకటిత విద్యుత్ కోతలను నివారించాలని బీఎస్పీ మండల అధ్యక్షుడు నేలమర్రి శ్యామ్ ఆదివారం ఒక ప్రకటనలో అధికారులను కోరారు. సమయ పాలన లేకుండా ఇష్టారాజ్యంగా విద్యుత్ కోత విధిస్తుండడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

మధునాయక్‌కు సేవారత్న అవార్డు



అవార్డు అందుకుంటున్న మధునాయక్

పాలకవీడు : మండలానికి చెందిన గిరిజన నాయకుడు కెళావత్ మధునాయక్ సామాజిక సేవా రంగంలో చేసిన సేవలకు గుర్తుగా పుడమి సాహితీ వేదిక ఆధ్వర్యంలో సేవారత్న అవార్డు అందజేశారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం నల్లగొండలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ పేరు మీదుగా సేవారత్న జాతీయ విశిష్ట సేవా పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మధునాయక్ మాట్లాడుతూ.. సేవను గుర్తించడం సంతోషంగా ఉందన్నారు. ప్రతీఒక్కరూ సామాజిక సేవలో పాలుపంచుకోవాలన్నారు. గత సంవత్సరం మదర్‌థెరిసా సేవా పురస్కారం అందుకున్నట్లు, సేవలను గుర్తించిన మహనీయులకు కృతజ్ఞతలు తెలిపారు.

రేపు ఉచిత కంటి వైద్యశిబిరం

కోదాడరూరల్ : పట్టణంలోని పెన్షనర్స్ భవన్‌లో విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు కోదాడ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వేనేపల్లి శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వరంగల్‌కు చెందిన శరత్ మాక్సీవిజన్ సూపర్ స్పెషలిటీ హాస్పత్రి వారిచే ఈ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పోలీస్‌శాఖ, జర్నలిస్టులకు, హెల్త్‌కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులున్న వారికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి శస్త్రచికిత్సలు చేయనున్నట్లు తెలిపారు.

5న హుజూర్‌నగర్‌లో..

హుజూర్‌నగర్ : పట్టణంలోని ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనంలో ఈనెల 5న ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ సోమయ్య, కె.వీరారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, రిటైర్డ్ ఉద్యోగులు, వారిపై ఆధారపడిన వారు, ఈహెచ్‌ఎస్ హెల్త్ కార్డు ఉన్న వారికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఆపరేషన్లు నిర్వహిస్తారని అన్నారు.

శివాలయంలో డీఎస్పీ ప్రత్యేక పూజలు



శివాలయం వద్ద డీఎస్పీకి స్వాగతం పలుకుతున్న అర్చకులు

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని శ్రీ ఇష్టకామేశ్వరీ సమేత శ్రీ స్వయంభు శంభులింగేశ్వర స్వామి దేవాలయంలో కోదాడ డీఎస్పీ ప్రకాశ్ దంపతులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి అర్చకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం డీఎస్పీ దంపతులు స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు వారికి స్వామి వారి ఆశీర్వచనాలు తీర్థప్రసాదాలు అందించారు. ఆయన వెంట ఎస్‌ఐ సురేష్‌యాదవ్, అర్చకులు విష్ణువర్ధన్‌శర్మ, ఆలయ మేనేజర్ కొండారెడ్డి తదితరులున్నారు.

అకాల వర్షంతో పత్తి రైతులకు ఊరట



చింతలపాలెం మండలంలో సాగవుతున్న పత్తి

హుజూర్‌నగర్ : నియోజకవర్గంలో ఆదివారం తెల్లవారుజామున కురిసిన అకాల భారీ వర్షంతో పత్తి రైతులకు ఊరట లభించింది. కొంత కాలంగా వర్షాలు లేక ఎండ తీవ్రతకు అల్లాడిన ప్రజలు రాత్రి కురిసిన వర్షానికి వాతావరణం చల్లబడటంతో కొంత ఉపశమనం పొందారు. అదే విధంగా కొంతకాలంగా వర్షాలు లేక బెట్టకొచ్చిన మెట్ట పంటలకు కురిసిన వర్షం ప్రాణం పోసింది. నియోజకవర్గంలోని పాలకవీడు మండలంలో అత్యధికంగా 135.0 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. మఠంపల్లి మండలంలో 77.8మిల్లీ మీటర్లు, నేరేడుచర్ల మండలంలో 54.0 మిల్లీ మీటర్లు, గరిడేపల్లి మండలంలో 53.8 మిల్లీ మీటర్లు, చింతలపాలెం మండలంలో 47.0 మిల్లీమీటర్లు, మేళ్లచెరువు మండలంలో 5.3 మిల్లీ మీటర్లు, హుజూర్‌నగర్ మండలంలో 0.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

సమయపాలనపై పట్టింపేదీ?

- వైద్యశాలలో అందుబాటులో ఉండని పశు వైద్యసిబ్బంది
- వైద్యం అందక మృత్యువాత పడుతున్న మూగజీవాలు
- నాటు వైద్యులను ఆశ్రయిస్తున్న రైతులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



బూరుగడ్డలో మధ్యాహ్నం 12 గంటలకే మూసివేసిన పశువైద్యశాల

హుజూర్‌నగర్ రూరల్ : వ్యవసాయ అనుబంధ రంగాలలో పశుపోషణ ఎంతో కీలకం. వ్యవసాయం తరువాత రైతు కుటుంబాలు ఎక్కువగా ఆధారపడేది పశుపోషణపైనే. అలాంటి ప్రాధాన్యం కలిగిన పశుసంవర్థక శాఖలో సరిపడా సిబ్బంది లేకపోవడంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. పశువులు రోగాల బారిన పడితే సబ్‌సెంటర్లకు తీసుకెళ్తే పరిస్థితి అధ్వానంగా ఉంటుంది. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సబ్ సెంటర్లను వైద్యులు ఎప్పుడు మూస్తారో.. ఎప్పుడు తెరిచి ఉంచుతారో తెలియని పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు.

సమయపాలన పాటించని సిబ్బంది..

మండలంలో గేదెలు 1561, ఆవులు 840, గొర్రెలు 14వేల657, మేకలు 2వేల645 ఉన్నాయి. మండలంలోని హుజూర్‌నగర్, వేపలసింగారం, లింగగిరిలో ప్రాథమిక పశు వైద్యశాలలు, బూరుగడ్డ, లక్కవరం, అమరవరం గ్రామాల్లో సబ్‌సెంటర్లు ఉన్నాయి. కానీ ఆ ఆస్పత్రులలో పశువైద్యులు అందుబాటులో ఉండకపోవడంతో మూగజీవాలకు వ్యాధులు సోకితే ప్రైవేట్ వ్యక్తులు, నాటు వైద్యంపై ఆధారపడాల్సి వస్తోందని, రాత్రి వేళల్లో ఏ ఆపద వచ్చినా తెల్లవారే వరకు దేవుడు మీద భారం వేసి గడపాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. అన్ని పశువైద్యశాలలకు, సబ్ సెంటర్లకు సిబ్బంది ఉన్నా సమయపాలన పాటించకుండా మధ్యాహ్నం 12గంటల వరకు మాత్రమే ఉంటున్నారని మండల రైతులు వాపోతున్నారు.

మధ్యాహ్నం వరకే విధులు..

మండంలోని ఆయా సబ్ సెంటర్లలో పనిచేస్తున్న సిబ్బంది మధ్యాహ్నం వరకే విధులు నిర్వహిస్తున్నారని, ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4వరకు ఉండాల్సిన సిబ్బంది మధ్యాహ్నం తరువాత సబ్‌సెంటర్‌ను మూసివేస్తున్నారని పాడిరైతులు ఆవేదన చెందుతున్నారు. మధ్యాహ్నం తరువాత పశువులకు ఏదైనా వ్యాధి సంభవిస్తే ప్రధాన వైద్యశాలలే దిక్కని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పశు వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన పాటించి మూగజీవాలకు సకాలంలో వైద్యం అందించే విధంగా చూడాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

వైద్యం అందడం లేదు



“బూరుగడ్డ గ్రామానికి సబ్ సెంటర్ ఉన్నా సకాలంలో సిబ్బంది లేకపోవడంతో పశువులకు సరైన వైద్యం అందడం లేదు. వ్యవసాయం తరువాత అదే ప్రాధాన్యత కలిగిన పశువులకు వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి సక్రమంగా వైద్యసేవలు అందేలా చూడాలి.

– యరగాని వెంకన్న, పాడిరైతు, బూరుగడ్డ

వైద్యులు అందుబాటులో ఉండాలి



“పశు వైద్యసిబ్బంది సకాలంలో అందుబాటులో ఉండి సమయపాలన పాటించాలి. ఇటీవల మేకలకు మూతివాపు వ్యాధి సోకిందని వెళితే సిబ్బంది సరైన వైద్యం అందించకపోవడంతో నాలుగు మేకలు మృతి చెందాయి. సిబ్బంది ఎప్పుడు వస్తారో, ఎప్పుడు వెళ్తారో తెలియడం లేదు. ఉన్నాతాధికారులు చొరవ తీసుకోవాలి.

– కీర్తి సైదులు, మేకల యజమాని, మాచవరం

ఇబ్బంది లేకుండా చూస్తాం



“మండలంలో 3ప్రాథమిక పశు వైద్యశాలలు, 3 సబ్‌సెంటర్లు ఉన్నాయి. సరిపడా సిబ్బంది కూడా ఉన్నారు. బూరుగడ్డలో పశువైద్య సిబ్బంది సమయపాలన పాటించని విషయం నాదృష్టికి రాలేదు. రైతులు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకోవడంతో పాటు ఇక్కడ మూగజీవాలకు ఇబ్బంది లేకుండా సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటూ వైద్యసేవలు అందించేలా కృషి చేస్తాను.

– కె.శ్రీనివాసరెడ్డి పశువైద్యాధికారి, హుజూర్‌నగర్

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- ఆర్డీఓ జగదీశ్‌రెడ్డి

హుజూర్‌నగర్ : ఎన్నికల్లో రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని ఆర్డీఓ జగదీశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో నియోజకవర్గంలోని రెవెన్యూ, పోలీస్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణపై సమీక్షించి రూట్‌లను నిర్ధారించారు. అనంతరం ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో మొత్తం 308 పోలింగ్ కేంద్రాలు ఉండగా వాటిలో 91 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్లు తెలిపారు. వాటి వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎన్నికల కమిషన్ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తుందని తెలిపారు. సమావేశంలో డీఎస్పీ ప్రకాష్, సీఐలు రామలింగారెడ్డి, రామకృష్ణారెడ్డి, అన్ని మండలాల తహసీల్దార్‌లు, ఎస్‌ఐలు, ఎన్నికల డీటీలు సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ జగదీశ్‌రెడ్డి

వర్కర్లకు కనీస వేతనాలు అమలుచేయాలి



నిరసన తెలుపుతున్న నాన్‌టీచింగ్ వర్కర్స్

మఠంపల్లి : తెలంగాణ ప్రభుత్వం కేజీబీవీలో పనిచేస్తున్న నాన్‌టీచింగ్ వర్కర్లకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనంలో భాగంగా కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కామెళ్ల నవీన్ అన్నారు. ఆదివారం మండలంలోని బక్కమంతుల గూడెం వద్ద గల కేజీబీవీ (కస్తూరిబా గాంధీ బాలికల ఉన్నత పాఠశాల) వద్ద నాన్‌టీచింగ్ వర్కర్స్‌తో కలిసి నిర్వహించిన నిరసనలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోర్టు తీర్పులను అమలుచేయకుండా వెట్టిచాకిరీ చేయిస్తున్నారని విమర్శించారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను సవరణ పేరుతో ప్రభుత్వాలు నిర్వీర్యం చేయాలని చూస్తున్నాయని, కార్మికులంతా ఐక్యంగా పోరాడాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు కామెళ్ల సుందరయ్య, నాగమణి, సైదమ్మ, సుజాత, సరిత, హారిక, జయసుధ, ఉమ, రమాదేవి, అరుణ, పుష్పలత, కాశీలక్ష్మి, బి.సైదమ్మ, ఎస్.నాగమణి, తదితరులున్నారు.

యువత ఓటరుగా నమోదు చేసుకోవాలి

మునగాల : యువత ఓటరుగా నమోదు చేయించుకోవాలని తహసీల్దార్ వి.ఆంజనేయులు అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆదివారం ఆయన పరిశీలించి మాట్లాడారు.. బూత్ లెవల్ అధికారులు గ్రామాల్లో 18సవంత్సరాలు నిండిన ప్రతిఒక్కరికి అవగాహన కల్పించి ఓటరు జాబితాలో ఫారం-6ద్వారా ఓటు నమోదు చేయించాలని, ఓటరు జాబితాలో తప్పు ఒప్పులు ఉంటే ఫారం-8ద్వారా సరిచేసుకునే అవకాశం ఉందన్నారు. దీనిపై ఓటర్లందరికి అవగాహన తప్పనిసరిగా కల్పించాలని సూచించారు. మరణించిన వారి ఓటరు జాబితాను తయారు చేసి ఫారం-7ద్వారా ఓటరు జాబితా నుంచి తొలగించాలన్నారు. అనంతరం బీఎల్‌ఓలకు కిట్లను పంపిణీ చేశారు. ఆయన వెంట ఆర్‌ఐ రాధారెడ్డి, బీఎల్‌ఓలు సంధ్య, అనిత, మాణిక్యం, ఎల్లమ్మ, మణెమ్మ, రూపరాణి, అనంతుల శ్రీను పాల్గొన్నారు.



ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ ఆంజనేయులు

ఉద్యమకారులకు ప్రాధాన్యమిచ్చిన వారికే మద్దతు



తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న ఓయూ జేఏసీ నాయకులు

కోదాడ : మలిదశ తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన ఉద్యమకారులకు ప్రాధాన్యమిచ్చిన పార్టీలకే విద్యార్థుల మద్దతు ఉంటుందని ఓయూ జేఏసీ ప్రతినిధులు తెలిపారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 17న కోదాడ బాలుర ఉన్నత పాఠశాలలో 'గద్దర్ యాదిలో' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారులను కోరారు. ఈ కార్యక్రమ విజయవంతానికి ఇప్పటికే నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల్లో సన్నాహక సమావేశాలు నిర్వహించామన్నారు. అనంతరం తెలంగాణ తల్లి విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కందుల మధు, ఎస్‌ఎం శ్రీకాంత్‌యాదవ్, మాతంగి మురళి, వినోద్, రవి నాయక్, వీరబాబు, నవీన్, బండి గోపి, చింతల సాయిగోపి, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

నిరుపయోగంగా గోపాలమిత్ర భవనం



కరివిరాలలో పదేళ్లుగా ప్రారంభానికి నోచుకోని గోపాలమిత్ర భవనం

నడిగూడెం : మండల పరిధిలోని కరివిరాల గ్రామంలో పశువులకు వైద్య సేవలందించేందుకు పదేళ్ల క్రిందట రూ.10లక్షలతో గోపాలమిత్ర భవనాన్ని నిర్మించారు. ఈ గ్రామంలో ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు అధిక సంఖ్యలో ఉండడంతో అప్పట్లో భవనాన్ని నిర్మించారు. కాని ఈ భవనం నిర్మించిన నాటి నుంచి నేటి వరకు నిరుపయోగంగానే ఉంటుంది. పశువైద్య సేవలు మాత్రం గ్రామంలోనే నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ భవనం చుట్టూ కంపచెట్లు పెరిగి, మురుగునీరు చేరింది. సంబంధిత అధికారులు స్పందించి ఈ పక్కా భవనాన్ని ప్రారంభించి, పశువైద్య సేవలు పూర్తి స్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బుచ్చయ్య చారి మృతి తీరనిలోటు

మునగాల : మండల కేంద్రానికి చెందిన సీపీఎం నాయకుడు అలుగూరి బుచ్చయ్యచారి(80) మృతి పార్టీకి తీరనిలోటని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు దేవరం వెంకటరెడ్డి అన్నారు. ఆయన గుండెపోటుతో ఆదివారం హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో మృతి చెందినట్లు వెంకటరెడ్డి తెలిపారు. ఆయన ఐదు దశాబ్దాలుగా పార్టీలో క్రియాశీలక పాత్ర పోషించారని కొనియాడారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత



హుజూర్‌నగర్ : గంగమ్మతల్లి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి



మఠంపల్లి : హెల్త్ సబ్‌సెంటర్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి

- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

హుజూర్‌నగర్ : దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని, తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు జాతరలు ప్రతిబింభమని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన గంగమ్మ తల్లి జాతర మహోత్సవంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. గంగమ్మ తల్లీ ఆశీస్సులు ప్రతీఒక్కరిపై ఉండాలన్నారు. అమ్మవారి కరుణతో వర్షాలు కురవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా గంగమ్మ ఆలయానికి గంపలతో వచ్చిన మహిళలు అమ్మవారికి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ నాయకులు అమర్‌నాథ్‌రెడ్డి, అమర్‌గౌడ్, జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, కౌన్సిలర్లు జక్కుల శంభయ్య, జక్కుల వీరయ్య, గుండా ఫణి రాంరెడ్డి, దొంతిరెడ్డి పద్మ, జేఎస్‌డీ సైదులు, దీప, కిరణ్‌కుమార్, స్థానికులు, పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం

హుజూర్‌నగర్‌రూరల్ : మండల పరిధిలోని వేపలసింగారంలో ఆదివారం ముత్యాలమ్మ, అంకాలమ్మ తల్లి విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. తదనంతరం వారు యర్రారం పండుస్వామితో కలిసి సన్నాయి మేళతాలలో భారీ ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ అన్నెం శిరీషాకొండారెడ్డి, ఎంపీటీసీ ముడెం గోపిరెడ్డి, బీఆర్‌ఎస్ మండల యూత్ ఉపాధ్యక్షుడు చడపంగు ఉదయ్‌భాస్కర్, మాజీ మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్‌గౌడ్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

హెల్త్ సబ్‌సెంటర్ పనులకు శంకుస్థాపన

మఠంపల్లి : మండలంలోని యాతవాకిళ్లలో నూతనంగా నిర్మించనున్న పీహెచ్‌సీ హెల్త్‌సబ్‌సెంటర్ నిర్మాణ పనులకు ఆదివారం ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి శంకుస్థాపన చేశారు. అదే విధంగా మండలంలోని యాతవాకిళ్ల, వర్దాపురం గ్రామాల్లో జరుగుతున్న ముత్యాలమ్మ జాతరలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని అన్నిగ్రామాలల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమ పథకాలను ముమ్మరంగా చేపడుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కోలాహలం లక్ష్మీనర్సింహరాజు, మాజీ ఎంపీపీ ఎం.కొండానాయక్, రైతు సమన్వయ సమితి మండల కోఆర్డినేటర్ మచ్చ వెంకటేశ్వర్లు, ఉపసర్పంచ్ శాంతినర్సింహారెడ్డి, మండల బీసీసెల్ అధ్యక్షుడు ఎల్లావుల నాగయ్యయాదవ్, వర్దాపురం గ్రామశాఖ అధ్యక్షుడు బత్తుల సైదయ్య, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు పల్లె మట్టయ్య, గ్రామస్తులు, పాల్గొన్నారు.

వైభవంగా ముత్యాలమ్మ బోనాల పండుగ



మోతెలో బోనాలతో వెళ్తున్న మహిళలు

కోదాడ : మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరంగాపురంలో ఆదివారం ముత్యాలమ్మ జాతరను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ శిరీష గ్రామ మహిళలతో పాటు బోనం ఎత్తుకొని అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వేడుకల్లో గ్రామ మహిళలు,పాల్గొన్నారు.

కోదాడరూరల్ : మండల పరిధిలోని రామలక్ష్మీపురంలో ముత్యాలమ్మ పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో వెళ్లి అమ్మవారికి పడిపంటలు సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ తమ మొక్కులను చెల్లించుకున్నారు.

గరిడేపల్లి : మండలంలోని ఎల్‌బీనగర్ గ్రామంలో ఆదివారం ముత్యాలమ్మ బోనాల వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో మహిళలు బోనాలతో తరలివచ్చి ముత్యాలమ్మ తల్లికి నైవేద్యం సమర్పించి తమ మొక్కులను చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

నేరేడుచర్ల : మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు ఎన్‌టీఆర్‌నగర్‌లో ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బోనాలతో గ్రామంలో భారీగా ఊరేగింపు నిర్వహించి ముత్యాలమ్మ అమ్మవారికి సమర్పించారు. అనంతరం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కులను చెల్లించుకున్నారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ అలక సరితసైదిరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గంట జ్యోతి, నాయకులు గంట సైదులు, మారయ్య, వెంకన్న, పద్మ, జయమ్మ తదితరులున్నారు.

పాలకవీడు : మండలంలోని గుడుగుంట్లపాలెం, పాలకవీడు, నాగిరెడ్డిగూడెం గ్రామాల్లో ముత్యాలమ్మ బోనాల పండుగను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలతో వెళ్లి నైవేద్యంగా సమర్పించారు. డప్పు వాయిద్యాలతో అమ్మవారి ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ప్రజలు ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని గ్రామ దేవతకు బొడ్రాయికి నైవేధ్యాలు సమర్పించి మొక్కుకున్నారు. ఈ వేడుకలో ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజలు సుభిక్షంగా ఉండాలి

మునగాల : గ్రామదేవతల ఆశీస్సులతో గ్రామాల్లో పాడిపంటలు పుష్కలంగా పండాలని కోదాడ మాజీ ఎమ్మెల్యే పద్మావతి కోరారు. ఆదివారం మండలంలోని కోదండరామపురంలో ముత్యాలమ్మ పండుగలో ఆమె పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు కొప్పుల జైపాల్‌రెడ్డి, కొలిచెట్టి బుచ్చిపాపయ్య, కాసర్ల కోటేశ్వరరావు, కాలె సామియేలు, భీమపంగు శంకర్, విలాసకవి రామరాజు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ, కనకదుర్గమ్మ బోనాలు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని వేపలసింగారంలో ముత్యాలమ్మ, కనకదుర్గమ్మ పండుగను గ్రామస్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున బోనాలతో తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించి నైవేద్యం సమర్పించారు. తదనంతరం సర్పంచ్ అన్నెం శిరీషాకొండారెడ్డి, ఎంపీటీసీ ముడెం గోపిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మోతె : మండల కేంద్రంలో ఆదివారం ముత్యాలమ్మ అమ్మవారి బోనాల వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో తరలివచ్చి గ్రామ దేవతలకు నైవేధ్యం సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.



కోదాడ : ముత్యాలమ్మ అమ్మవారికి బోనం తీసుకెళ్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ శిరీష



కోదాడరూరల్ : బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు



గరిడేపల్లి : ఎల్‌బీనగర్‌లో బోనాలు ఎత్తుకొని వస్తున్న మహిళలు



నేరేడుచర్ల : 5వ వార్డులో బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు



పాలకవీడు : బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు



మునగాల : ముత్యాలమ్మ అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మావతి



హుజూర్‌నగర్‌రూరల్ : వేపలసింగారంలో బోనాలతో వెళ్తున్న సర్పంచ్ శిరీష, మహిళలు

ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం

కోదాడ : కేంద్ర ప్రభుత్వం వంటగ్యాస్ ధరలను తగ్గించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం పట్టణంలో బీజేపీ నాయకులు ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ.. అంతర్జాతీయంగా గ్యాస్ ధరలు ఎక్కువగా ఉన్నప్పటికి వేలకోట్ల రూపాయల భారాన్ని భరిస్తూ కేంద్ర ప్రభుత్వం వంటగ్యాస్ ధరలను తగ్గించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అక్కిరాజు యశ్వంత్, కోటకొమ్ముల భాగ్యమ్మ, ఓరుగంటి పురుషోత్తం, సాతులూరి హనుమంతరావు, రవి, వెంకటేష్, పోలా సతీష్, సతీష్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పాలాభిషేకం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

వృద్ధాశ్రమానికి బియ్యం అందజేత



బియ్యం అందజేస్తున్న క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల : వాసవీ క్లబ్ వ్యవస్థాపకుడు దివంగత కేసీ గుప్తా చేపట్టిన సేవా కార్యక్రమాలే వాసవీ, వనితా క్లబ్‌లు స్ఫూర్తిగా తీసుకున్నాయని ఆ క్లబ్ అధ్యక్షుడు కొత్త లక్ష్మణ్, వీరవల్లి శ్రీలతాకోటేశ్వర్ రావు అన్నారు. ఆదివారం సూర్యాపేట సమీపంలోని దురాజ్‌పల్లి వద్ద గల అన్నపూర్ణ వృద్ధాశ్రమం నిర్వాహకులకు క్లబ్ ఆధ్వర్యంలో 25కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో వాసవీ, వనితా క్లబ్‌ల ప్రధాన కార్యదర్శులు గుజ్జుల కోటేశ్వర్‌రావు, పోలిశెట్టి సంధ్య, వనితా క్లబ్ కోశాధికారి ఈగా భాగ్యలక్ష్మి, సభ్యులు నటరాజ్, హరి, వాసు, రాము, వేణుగోపాల్‌రెడ్డి తదితరులున్నారు.

అంగన్‌వాడీల సమ్మెకు వ్యవసాయ కార్మిక సంఘం మద్దతు

నేరేడుచర్ల : అంగన్‌వాడీ ఉద్యోగులు చేపట్టే నిరవధిక సమ్మెకు వ్యవసాయ కార్మిక సంఘం సంపూర్ణ మద్దతు ఉంటుందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.ధనుంజయనాయుడు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. అంగన్‌వాడీలను పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని, వారికి కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, పెన్షన్ సౌకర్యంతో పాటు ఈఎస్‌ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలను కల్పించడంతో పాటు ఉద్యోగ భద్రతను కల్పించాలన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం అంగన్‌వాడీలకు గ్రాడ్యుటీ, ఉద్యోగ విరమణ సదుపాయాలు టీచర్లకు రూ.10లక్షలు, హెల్పర్లకు రూ.5లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. 60ఏళ్లు దాటిన అంగన్‌వాడీ ఉద్యోగులకు వలంటరీ విరమణ కోరితే బెన్ఫిట్స్ అందించాలని, ప్రమాదబీమా సౌకర్యం రూ.5లక్షలు ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీలు చేపట్టే సమ్మెకు పూర్తి స్థాయిలో తమ మద్దతు ఉంటుందన్నారు.